ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 18-7-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.

2. నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మాస్టర్ ప్లాన్ రూపొందించి, ఈ ప్రాంతాన్ని ఒక విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

3. నదీ జలాలపై తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టు నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

4. రాష్ట్రంలో 2 లక్షల టన్నుల ఎరువుల కొరత ఉన్నా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు.

**కిషన్ రెడ్డి-ఖాజీపేట**

కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు వేగంగా జరుగుతున్నాయని , వచ్చే ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ , ఇప్పటికే ప్రాజెక్టు పనులు 60 శాతం పైగా పూర్తయ్యాయని చెప్పారు. 521 కోట్ల రూపాయల నిధులతో రైలు ఇంజిన్లు , కోచ్‌లు, వ్యాగన్ల ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు నిధుల కొరత లేదని , అవసరమైతే మరో 200 కోట్ల రూపాయలు కేటాయించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 3 వేల మందికి ఉపాధి లభిస్తుందని , దీనికి అనుబంధంగా హోటళ్లు , స్కిల్లింగ్, ఇతర రంగాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తారని , సికింద్రాబాద్ నుంచి జోధ్‌పూర్‌కు మొదటి రైలును కూడా ప్రారంభిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇక, MMTS రెండో దశను యాదగిరిగుట్ట వరకు పొడిగించే ప్రాజెక్టును 330 కోట్ల రూపాయిలపైగా అంచనా వ్యయంతో వేగిర పరుస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కొమరవెల్లి కొత్త రైల్వేస్టేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని , వచ్చే జనవరిలో స్టేషన్ ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ , నాంపల్లి రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులు కూడా వచ్చే ఏడాదికల్లా పూర్తి అవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు.

**సౌండ్ బైట్ ... కిషన్ రెడ్డి**

( MSL)

**బాసర - శ్రీధర్ బాబు**

రాష్ట్రంలోని అన్ని ఆలయాలను ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి చేస్తోందని, నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి నూతన ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జ్ఞాన సరస్వతి ఆలయం ఉన్న ప్రాంతంలో

ట్రిపుల్ ఐటీని  నెలకొల్పారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు ఉదయం మంత్రి శ్రీధర్ బాబు జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు , అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

(పీటీసీ, నిర్మల్)

**నదీ జలాలు - సీపీఎం**

నదీ జలాలపై తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టు నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. నదీ జలాలలో రాష్ట్ర వాటా తేల్చాలని కోరారు. నల్లగొండ జిల్లాలో ఈ ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, ఇందుకోసం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా కృషి చేయాలని జాన్ వెస్లీ అన్నారు. గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు , సెప్టెంబర్‌లలో తమ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై వామపక్షాలు ఐక్య కార్యాచరణతో పోరాడతాయని వెస్లీ స్పష్టం చేశారు.

(పీటీసీ, నల్లగొండ)

**సిరిసిల్ల - మిడ్ మానేరు రైతుల ధర్నా**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండల రైతులు మిడ్ మానేరు కుడి మెయిన్ కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. వరినారు ముదిరిపోతోందని, నాటు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని పొత్తూరు మానేరు బ్రిడ్జిపై పలు గ్రామాల రైతులు నిరసనకు దిగారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**సిరిసిల్ల - ఆయిల్ ఫామ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు మంచి లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్ తెలిపారు. బోయినపల్లి మండలం మర్లపేటలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలించిన ఆయన , రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తోందని, దీని ద్వారా రైతులు ఏడాదికి లక్షన్నర రూపాయల వరకు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**ఖమ్మం - కేటీఆర్**

రాష్ట్రంలో 2 లక్షల టన్నుల ఎరువుల కొరత ఉన్నా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా అక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఈ ఉదయం ఖమ్మంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను , నెలకు 4 వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వయోవృద్ధులను మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ కు ఓటేసిన ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని తారక రామారావు అన్నారు.

(పీటీసీ, ఖమ్మం)

**వరంగల్ - అంగన్ వాడీ**

ఎయిడ్స్, హెచ్ఐవి ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ టీచర్లు ముందుండాలి అని హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు , సూపర్ వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన

మాట్లాడుతూ, గర్భిణీలు 3వ, 9వ నెలలో హెచ్ఐవి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని చూడాలని సూచించారు. హెచ్ఐవితో బాధపడుతున్న వారి పట్ల వివక్షను తొలగించడానికి కృషి చేయాలన్నారు.
(పీటీసీ, వరంగల్)

**నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామాలకు కొత్త ఆధ్యాత్మిక పేర్లు**

ఈ గ్రామాలు తమ రాష్ట్రానికే చెందుతాయని ఢిల్లీలో ప్రకటించడం, దీనికి అక్కడి నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం వెళ్లే దారిలో ఉన్న రెండు గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పేర్లను ఖరారు చేసింది. దోమలపెంట గ్రామానికి బ్రహ్మగిరి అని, ఈగలపెంట గ్రామానికి కృష్ణగిరి అని పేరు మారుస్తూ జీఓ 26ను జారీ చేసింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బ్రహ్మగిరి గ్రామ బోర్డును ఆవిష్కరించారు. పేర్ల మార్పుపై సంతోషం వ్యక్తం చేశారు.

(సౌండ్ బైట్ ... ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ)

పిటిసి, నాగర్ కర్నూల్

**ఆసిఫాబాద్-12 గ్రామాల ఆందోళన**

ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలోని 12 గ్రామాల ప్రజలు తామ గ్రామాలను తెలంగాణలోనే కొనసాగాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ప్రతిపక్షాలు మద్దతు పలకడంతో ఈ ఆందోళన మొదలైంది. వారి నిరసనకు మద్దతు తెలిపిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ ప్రజల కోరికను ప్రభుత్వాలు గౌరవించాలని అన్నారు.

(సౌండ్ మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్)

పీటీసీ, ఆసిఫాబాద్)

**భట్టి-నాగార్జున సాగర్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో పర్యటిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , జెన్‌కో, ఇరిగేషన్ అధికారులతో కలిసి నాగార్జున సాగర్‌లోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు . అక్కడ విద్యుత్ ఉత్పత్తి, నీటి వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. మధ్యాహ్నం విజయవిహార్ అతిథి గృహంలో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.

(పీటీసీ, నల్లగొండ)

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు వరంగల్ , మహబూబాబాద్, యాదాద్రి, ఉమ్మడి నల్గొండ, నాగర్‌కర్నూలు జిల్లాల్లో , రేపు హనుమకొండ , వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.
(డెస్క్)

**వరంగల్ - స్వచ్ఛ సర్వేక్షణ్**

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఫలితాల్లో వరంగల్ మహా నగర పాలక సంస్థ జాతీయ స్థాయిలో 22వ స్థానాన్ని సాధించగా, రాష్ట్ర స్థాయిలో 3 నుంచి 10 లక్షల జనాభా కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుందని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర గృహ నిర్మాణ , పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తొలిసారి ప్రవేశపెట్టిన చెత్త రహిత నగరం గుర్తింపులో వరంగల్‌కు స్టార్ రేటింగ్ దక్కింది. అలాగే , గత ఆరు సంవత్సరాలుగా నిరంతరం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా గుర్తింపు పొందుతూ ఈసారి కూడా అదే ఘనతను నిలుపుకుంది.

(పీటీసీ, వరంగల్)

**ఆయుష్-మంత్రి రాజనర్సింహ్**

ఆయుష్ విభాగంలో కొత్తగా ఎంపికైన  138 మంది మెడికల్ ఆఫీసర్లకు త్వరలోనే నియామక పత్రాలు అందజేస్తామని  రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డిలోని తన నివాసంలో మంత్రిని కలిసిన పలువురు కొత్తగా ఎంపికైన డాక్టర్లు  , తమకు అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.
(పీటీసీ, సంగారెడ్డి)

**ఆసిఫాబాద్-కలెక్టర్**

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే నిన్న రాత్రి రెబ్బెన మండలం గోలేటి ఆశ్రమ పాఠశాల హాస్టలను తనిఖీ చేశారు. రాత్రి అక్కడే నిద్రించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి  , వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
(పీటీసీ, ఆసిఫాబాద్)

**మంచిర్యాల-సీఐ**

మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం పొక్కుర్ గ్రామంలో  సీఐ దేవేందర్ రావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం  నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని  50  ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు.
(పీటీసీ, మంచిర్యాల)

**ఆసిఫాబాద్-ఉపాధి హామీ తనిఖీ**

ఆసిఫాబాద్ జిల్లాలో  2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో శ్రీనివాస్ ,  డిఆర్‌డిఓ దత్తారావు ,  జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీనారాయణ సామాజిక తనిఖీ నిర్వహించారు.
(పీటీసీ, ఆసిఫాబాద్)